



ఆదివారం ప్రత్యేకం

దసరా వచ్చిందంటే... జగన్మాతను కొలవని ఊరుండదు.. అమ్మ విగ్రహం కనిపించని వీధి ఉండదు.. ఎక్కడ చూసినా, ఎటు చూసినా అమ్మ భక్తులే.. జననీ శివకామినీ.. జయ శుభకారిణీ.. విజయరూపిణీ.. అమ్మవు నీవే అఖిల జగాలకు.. అమ్మల గన్నా అమ్మవు నీవే.. నీ చరణములే నమ్మితినమ్మా.. శరణము కోరితి అమ్మా భవానీ..! అంటూ ఎర్రటి దుస్తులు ధరించి.. చేతులకు గాజులు.. కాళ్లకు గజ్జెలు కట్టుకుని.. ముఖానికి పసుపు.. కుంకుమ రాసుకుని అచ్చంగా అమ్మవారిలా తయారై.. భవానీ మాల వేసుకుని 9 రోజులు అమ్మను నిష్ఠగా కొలుస్తారు. ఇందులో ఆడామగా తేడా లేదు. మంత్రులు.. ఎమ్మెల్యేలు.. చిన్నలు.. పెద్దలు.. మహిళలు.. అందరూ అమ్మ సేవలో తరిస్తారు.. మాలధారణ చేసి బెజవాడకు కాలినడకన బయలుదేరేవారూ లక్షల్లోనే ఉంటారు. మన జిల్లాలో మరో ప్రత్యేకత ఉంది. అష్టాదశ శక్తి పీఠాల్లో రెండు ఇక్కడే ఉన్నాయి.. అంతే కాదండోయ్.. అమలాపురంలో జరిగే చెడీతాలింఖానా దసరాలో మరో ప్రత్యేకం.. 187 ఏళ్లుగా తాలింఖానా నడుస్తోంది. ఇక రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో జరిగే దసరా ఉత్సవం తెలియని వారుండరు. మైసూరులో జరిగే దసరా ఉత్సవాల తర్వాత అత్యంత వైభవంగా ఈ ఉత్సవాలు జరుగుతాయని చెబుతారు. అందుకే రెండో మైసూరు ఉత్సవాలంటారు. గత 91 ఏళ్లుగా ఎంతో వైభవంగా ఉత్సవాలు చేస్తున్నారు.. అటు కరపలో దసరా సంబరం మరో ప్రత్యేకం. ఏనుగు, హంస ప్రతిమలతో ఉత్సవం చేస్తారు. ఇక పోలీసులు చేసే ఆయుధపూజ ప్రత్యేకమే.. దసరా వచ్చిందంటే ఉభయ గోదావరి జిల్లాల్లో ఆ సందడే వేరు.. అదేంటో చూద్దామా..!

2 అష్టాదశ పీఠాలు ఇక్కడే

ద్రాక్షారామ/పిఠాపురం, అక్టోబరు 5: దేశంలో ప్రధానమైన శక్తిపీఠాలు 18. వీటిని అష్టాదశ శక్తి పీఠాలు అంటారు. అందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే రెండు శక్తిపీఠాలు ఉండడం విశేషం. అందులో ఒకటి ద్రాక్షారామలో ఉండగా, మరొకటి పిఠాపురంలో ఉంది. సతీదేవి తండ్రి దక్షుడు యజ్ఞం తలపెట్టి అల్లుడైన శివుడిని తప్ప దేవతలందరినీ ఆహ్వానిస్తాడు. తండ్రి నిర్వహిస్తున్న యజ్ఞం తిలకించాలని సతీదేవి కోరుతుంది. శివుడు నిరాకరించడంతో సతీదేవి ఒంటరిగా యజ్ఞానికి వెళుతుంది. అక్కడ తండ్రి చేసిన అవమానం భరించలేక ద్రాక్షాయణి నేలపై తన బొటనవేలితో రాసి అగ్నికీలలు సృష్టించి ఆత్మాహుతి చేసుకుంటుంది. సతీవియోగం భరించలేని ప్రళయ రుద్రుడు సతీదేవి సూక్ష్మ శరీరాన్ని భుజస్కంధాలపై ధరించి విలయతాండవం చేస్తాడు. ఈ ప్రళయానికి అడ్డుకట్ట వేసేందుకు విష్ణువు సతీదేవి సూక్ష్మ శరీరాన్ని తన సుదర్శన చక్రంతో 108 ఖండాలుగా చేస్తాడు. అవి భూమిపై పడిన ప్రాంతాల్లో అష్టాదశ శక్తిపీఠాలుగా ఏర్పడ్డాయని పురాణ కథనం. అందులో 101 విశేషంగా, 52 పీఠాలు ముఖ్యమైనవిగా , ముఖ్యాతిముఖ్యమైన 18 భాగాలు పడిన చోట అష్టాదశ శక్తి పీఠాలుగా విరాజిల్లుతున్నాయి. అష్టాదశ శక్తిపీఠాల్లో ముఖ్యమైంది పిఠాపురంలోని పురుహూతికాదేవి ఆలయం. అష్టాదశశక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠానికి అధిష్ఠాన దేవతైన పురుహూతికాదేవి కొలువైన క్షేత్రం పిఠాపురంలోని ఈ పాదగయ క్షేత్రం. ఇది దక్షిణకాశీగా, శక్తిపీఠంగా విరాజిల్లుతోంది. అష్టాదశ శక్తి పీఠా ల్లో ముఖ్యమైన పీఠభాగం(పిరుదులు) పడినచోటే పీఠాపురంగా, పీఠభాగానికి అధిష్ఠాన దేవత కావడంతో ఇక్కడ అమ్మవారు పీఠాంబికగా, పురుహూతు(ఇంద్రు)డు విద్యోపాసన చేయడంతో అతడి కోరిక మేరకు పురుహూతికాదేవి నామంగా ప్రసిద్ధి గాంచిందని స్కాంద మహాపురాణం భీ మఖండంలో వ్యాసభగవానుడు అమ్మవారి గురించి వర్ణించారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కొలువుదీరిన మాణిక్యాంబ అమ్మవారు అష్టాదశ శక్తి పీఠాల్లో ద్వాదశ (12వ) శక్తిపీఠంగా పూజలందుకుంటున్నారు. అందులోని చెంప భాగం పడడంతో ఇది ద్వాదశ శక్తి పీఠం ద్రాక్షారామలో మాణిక్యాంబగా అవతరించిందని పురాణగాథ. భీమేశ్వరాలయంలో మాణిక్యాంబ అమ్మవారిని దక్షిణాభిముఖంగా సాలగ్రామశిలతో నిర్మితమైన శ్రీచక్రం బిందువుపై ఆదిశంకరాచార్యులు పునఃప్రతిష్ఠ చేశారు. అష్టాదశ శక్తి పీఠాలలో ఎక్కడా జరగని విధంగా ఏకకాలంలో అమ్మవారికి, శ్రీచక్రానికి అర్చన జరగడం ప్రత్యేకత.



పిఠాపురం పురుహూతికా అమ్మవారు



ద్రాక్షారామ మాణిక్యాంబ

అమ్మా..భవానీ



ఉమ్మడి జిల్లాలో ఊరూరా.. జగన్మాతకు జేజేలు

ప్రత్యేక ఆకర్షణగా చెడీతాలింఖానా..





(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

దసరా పండుగ వచ్చిందంటే చాలు.. అమలాపురంలో జరిగే శరన్నవరాత్రుల సంబరాలు ప్రతీ ఒక్కరికి గుర్తొస్తాయి. ముఖ్యంగా ఇక్కడ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే చెడీతాలింఖానా ఎంతో ప్రత్యేకం. వీటిని తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అశేష ప్రజానీకం తరలివస్తారు. అమలాపురంలో సుమారు 189 ఏళ్లకు పైగా జరిగే ఉత్సవాలకు చారిత్రాత్మక ప్రాధాన్యత ఉంది. 1835వ సంవత్సరంలో బ్రిటీష ప్రభుత్వ అనుమతి పొంది కొంకాపల్లిలో దసరా ఉత్సవాలు ప్రారంభించారు. ఈ ఏడాది 189వ విజయదశమి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. కొంకాపల్లిలో ఐరావతం, రాజహంస వాహనాలపై అమ్మవారి ఉత్సవమూర్తుల నుంచి భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. మహిపాలవీధిలోని శ్రీఅబ్బిరెడ్డి రామదాసు చెడీతాలింఖానా 1856వ సంవత్సరంలో ప్రారంభమైంది. శ్రీరాజహంస వాహనంపై భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. 169వ విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కొంకాపల్లి-మహిపాలవీధుల ఆధ్వర్యంలో చెడీతాలింఖానా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పట్టణంలోని నల్లావీధి, గండువీధి, రవణం వీధి, రవణంమల్లయ్య వీధి, శ్రీరామపురం వీధుల్లో ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ప్రతి ఏటా దసరా ఉత్సవాల ముగింపు రోజున భారీ ఊరే గింపులు నిర్వహిస్తారు. కర్రలు, కత్తులు, పటాకత్తులు, బల్లాలు, లేడి కొమ్ములు, అగ్గి బరాటాలు, సరిగమలు, బంతుల తాళ్లు, కత్తి-డాలు, అగ్గి తాళ్ల వంటి వాటితో ఒళ్లు గగుర్పాటు కలిగించే విన్యాసాలను చెడీతాలింఖానాలో ప్రధానంగా నిర్వహిస్తారు.కళ్లకు గంతలు కట్టుకుని పొట్టపై కూరగాయలు, కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, బూడిద గుమ్మడికాయలు వంటివి కత్తులతో ఒక్క వేటుకు నరకడం ప్రత్యేక ఆకర్షణ.

మూడులాంతర్ల సెంటరే.. దేవీచౌక్



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 5: రాజమహేంద్రవరంలో మూడు లాంతర్ల సెంటరుగా పేరుగాంచిన ప్రస్తుత దేవీచౌక్‌కు ఆ పేరు రావడానికి శ్రీబాలాత్రిపుర సుందరీదేవి విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించడమే ప్రధాన కారణం. బ్రిటీష్ హయాంలో నాలుగురోడ్ల కూడలిగా ఉన్న ప్రాంతంలో అప్పట్లో వీధిదీపాలుగా మూడు లాంతర్లను సాయంత్రం 5:30 గంటలకే వెలిగించి రాటకు తగిలించి వెళ్లేవారు. అప్పటి నుంచి మూడు లాంతర్ల కూడలిగా దేవీచౌక్‌ను ఆనాటి ప్రజలు పిలిచేవారు. 1933 నుంచి బత్తుల మల్లికార్జునరావు సోదరులు శ్రీబాలాత్రిపుర సుందరీదేవి విగ్రహాన్ని ఈ కూడలిలో ఉంచి ఏటా విజయదశమి ఉత్సవాలు చేసేవారు. 1960లో శ్రీబాలాత్రిపుర సుందరీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీంతో క్రమేపీ మూడు లాంతర్ల సెంటర్ దేవీచౌక్‌గా రూపాంతరం చెందింది. నాలుగు స్తంభాలను నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ఆ స్తంభాలపై ప్రతిష్ఠించారు. ఆలయం పైభాగాన ఓ పెద్ద గడియారం ఏర్పాటు చేశారు. ఇతర ఊర్ల నుంచి రాజమహేంద్రవరం వచ్చిన వారు ఏ మూలకువెళ్లినా తిరిగి దేవీచౌక్ చేరుకుని క్లాక్‌లో సమయం చూసుకుని బయలుదేరేవారు. అది ఇప్పటికీ ఉంది. దేవీచౌక్ అమ్మవారి ఆలయాన్ని ఆలయ కమిటీ 1991లో ఆధునీకరించింది. ఆలయ కమిటీ అధ్యక్షులుగా బత్తుల వంశస్తులు కొనసాగుతూ ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలంటే గోదావరి జిల్లాల్లో ప్రత్యేకమైన పండుగగా చూస్తారు. ఉత్సవాల తొమ్మిది రోజుల్లో సుమారు రెండు లక్షలు పైబడి భక్తులు వస్తారు. ఇక్కడ విద్యుద్దీ పాలంకరణలు ప్రత్యేక ఆకర్షణ. ప్రస్తుతం 91వ దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మ వారు అన్నపూర్ణదేవి అలంకరణంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆయుధమే.. దైవంగా..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

దసరా ఉత్సవాల్లో భాగంగా పోలీసులు ఆయుధ పూజ చేస్తారు.. ఇదీ ఎందుకు చేస్తారనేది దేవ రహస్యమే.ఈ ఆయుధ పూజకు పురాణ ప్రతీతి ఉంది. దేవ దానవ సంగ్రామంలో ఉత్తరాషాఢ శ్రవణం నక్షత్రాల నడుమ అభిజిత్ లగ్నంలో దేవతలు విజయం సాధించడాన్ని పురస్కరించుకొని ఆయుధ పూజ చేస్తారని ప్రతీతి. ఆ లగ్నంలోనే దుర్గాదేవి మహిషాసురుడు అనే రాక్షసుడిని సంహరించింది. అప్పటి నుంచీ ఆయుధాలను దసరా రోజున పూజించడంతో విజయం వరిస్తుందని నమ్ముతారు. అర్జు నుడు తన అస్త్రాలను జమ్మి చెట్టుపై దాచి విజయదశమికి ఒకరోజు ముందుగా వాటిని తీసుకొని వెళ్లి కురుక్షేత్ర యుద్ధంలో విజయం సాధిస్తాడు. ఏడాదంతా విజయాలు ఇవ్వాలని పోలీసులు, సైన్యం, పారామిలిటరీ దళాలు ఆయుధ పూజను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తాయి. పోలీసుల వృత్తిలో ఆయుధం ఒక భాగం. దుష్టశక్తులపై పైచేయి సాధించి వారు వృత్తిలో విజయం సాధించడానికి ఆయుధమే ప్రధాన ఉపకరణంగా ఉంటుంది. అందువల్ల విజయదశమి రోజున ఆయుధ పూజ చేస్తారు. లాఠీ దగ్గర నుంచి అధునాతన తుపాకీ తదితర ఆయుధాలను శుభ్రం చేసి ప్రత్యేకంగా పూజిస్తారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సాయుధ రిజర్వు పోలీసుల భద్రతలో ఉండే ఆయుధాగారంలో జిల్లా ఎస్పీ పూజ చేస్తారు. వాహనాలను పూజిస్తారు. బ్రిటిష్ కాలం నుంచే ఈ సంప్రదాయం ఉంది.



మాలధారణం.. నియమాల తోరణం





ద్రాక్షారామ/అనపర్తి, అక్టోబరు 5: దసరా పర్వదినాల్లో భవానీ దీక్ష తీసుకోవడం ఓ సంప్రదాయంగా వస్తోంది. దేవీ నవరాత్రి ఉత్సవాల సమయంలో 11 రోజుల పాటు ఈ దీక్షను చేపడతారు. అమ్మవారి అనుగ్రహం పొందా ల నుకునేవారు ఈ మాలను ధరిస్తారు. దీక్షలో సింధూర రంగు వస్త్రాలు ధరించి నియమనిబంధనలను కచ్చితంగా పాటిస్తారు. వీరిని 'భవానీ' అనే పిలుస్తారు. ఆడమగా తేడా లేకుండా అందరికీ ఇదే పేరు. బెజవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మను దర్శించుకున్న తర్వాత దీక్ష విరమిస్తారు. వాహనాల్లో వెళ్లేవారితో పాటు లక్షలాది మంది తమ స్వగ్రామాల నుంచి కాలినడకన ఇంద్రకీలాద్రి వెళుతున్నారు. ప్రముఖుల దగ్గర నుంచి సామాన్యుల వరకు దీక్ష తీసుకుంటారు. ఈసారి మంత్రి వాసంశెట్టి సుభాష్ నాలుగో సారి భవానీ మాలధారణ చేసి దీక్ష చేపట్టారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం రోజున ద్రాక్షారామలో పీఠం ఏర్పాటు చేసుకుని భవానీ దీక్ష చేపట్టారు. స్వతహాగా అమ్మవారి భక్తుడైన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భవానీమాల ధరించి అమ్మవారి సేవలో ఉన్నారు. ఇప్పటివరకు ఆయన తొమ్మిది పర్యాయాలు భవానీమాల ధరించారు. ఇంట్లోనే పీఠం ఏర్పాటు చేసుకుని నవ రాత్రుల పూజలు నిర్వహిస్తున్నారు. 2004వ సంవత్సరం నుంచి ఇంట్లోనే అమ్మవారి పీఠం ఏర్పాటు చేసుకుని కుదిరిన ఏడాదిలో మాలధారణ చేసుకుని అమ్మవారిని కొలుస్తున్నట్టు చెప్పారు.



కమనీయం కరప సంబరం

కరప, అక్టోబరు5: దసరా పండుగ అంటే ఠక్కున గుర్తొచ్చేది కరప..ఈ సంబరం కోసం గ్రామస్తులు, బంధువులు ఆత్రంగా ఎదురుచూస్తుంటారు. మైసూర్‌లో నిర్వహించే దసరా ఉత్సవాన్ని కనులారా వీక్షించిన గ్రామ పూర్వీకులు కరపలో కూడా ఇటువంటి ఉత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహించాలని నిర్ణయించారు. మైసూర్‌లో నిజ ఏనుగులతో నిర్వహించే సంబరాన్ని ఇక్కడ చెక్క, గోనె సంచులు,తెల్లటి వస్త్రాలు, ఇతర ముడిసరుకుతో తయారుచేసిన ఏనుగు ప్రతిమతో చేయడం ప్రారంభించారు. గ్రామంలో పల్లపువీధి, మెరకవీధి, కొత్తపేట, నీలయ్యతోట నుంచి ఏనుగులు, సీతమ్మపేట, రామదాసు గుడి, బీసీపేట, ఎస్సీ పేటల నుంచి హంస ప్రతిమలు ఈ సంబరంలో పాల్గొంటాయి. అనంతర కాలంలో స్థానిక పంచాయతీ వీధి పెద్దలు హంస ప్రతిమను రూపొందించి సంబరంలో భాగస్వామ్యులయ్యారు. ఈ ప్రతిమలకు రంగురంగుల విద్యుత్ అలంకరణలు చేసి ప్రత్యేక వాహనాలపై రాత్రి తెల్లవార్లు గ్రామవీధుల్లో ఊరేగిస్తారు. శరన్నవరాత్రులను తొమ్మిది రోజుల పాటు కరప దుర్గాదేవి ఆలయంలో ఘనంగా నిర్వహిస్తారు. దశమిరోజున అమ్మవారిని బాణసంచాకాల్పుల నడుమ పల్లకిలో గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఇలా చేయడం వల్ల గ్రామం సుభిక్షంగా ఉంటుందని, పాడి పంటలతో అలరారుతుందని ప్రజలు విశ్వసిస్తారు.

రైస్ మిల్లుల ర్యాండమైజేషన్ ప్రక్రియ రద్దు

● రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు ● జేసీ నిషాంతి



అమలాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందికరంగా మారిన రైసు మిల్లుల ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేసినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. పౌరసరఫరాలశాఖ కమిషనర్ జి.వీరపాండియన్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మనజీర్‌జిలానీ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు శనివారం కలెక్టరేట్ నుంచి జేసీ పాల్గొన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న విధి విధానాలు, రైసుమిల్లుల రిజిస్ట్రేషన్, వాహనాలకు జీపీఎస్, బ్యాంకు గ్యారంటీల సేకరణ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సిబ్బంది నియామకం, తేమ శాతాన్ని నిర్ధారించే పరీక్షలు తదితర అంశాలపై తొలుత అవగాహన కల్పించారు. అనంతరం జేసీ నిషాంతి మాట్లాడుతూ ఇకపై రైతులు సమీపంలోని తమకు నచ్చిన రైసు మిల్లులకు ధాన్యాన్ని తరలించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. అందుకు అవసరమైన వాహనాలు, గోనె సంచులను సమకూర్చడంతో పాటు ధాన్యం ఎగుమతి, దిగుమతులకయ్యే లేబర్ చార్జీలను కూడా చెల్లించాలని అధికారులను ఆమె ఆదేశించారు. రైతుల బయోమెట్రిక్ ఆధారంగా ధాన్యాన్ని సేకరించాలని, ధాన్యాన్ని రవాణా చేసే వాహనాలను జీపీఎస్ పరికరాల ద్వారా పర్యవేక్షించాలన్నారు. మిల్లుల వద్ద ఆలస్యం జరగకుండా తగినంత మంది హమాలీలను నియమించుకోవాలన్నారు. డివిజన్, మండల, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. నవంబరు మొదటి వారంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఈ లోపుగా తేమ పరికరాలు, వేయింగ్ బ్రిడ్జిలను తనిఖీ చేయాలన్నారు. రైసు మిల్లుల నుంచి బ్యాంకు గ్యారంటీలను సేకరించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 17 శాతం తేమ నమోదైతే క్వింటాల్ ధాన్యానికి తరుగు ఉండదన్నారు. తేమ శాతం 18గా నమోదైతే ఒక కిలో తరుగు, 19 శాతం అయితే 2 కిలోలు, 20 శాతం ఉంటే 3 కిలోలు, 21 శాతం ఉంటే 4 కిలోలు, 22 శాతం పైబడి ఉంటే క్వింటాకు 5 కిలోలు తరుగుగా నిర్ధారించామన్నారు. చౌకధరల దుకాణాలకు సంబంధించి మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ల పనితీరుపై తనిఖీ చేయాలని డీఎస్‌వో ఉదయభాస్కర్‌ను ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ సహాయ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు తగ్గిన వెంటనే ఇసుక తవ్వకాలు చేపట్టాలి



ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్

రావులపాలెం, అక్టోబరు 5: గోదావరిలో వరద నీరు తగ్గిన వెంటనే ఇసుక ర్యాంపులలో తవ్వకాలకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి పూర్తిస్థాయిలో ఇసుక ర్యాంపుల నుంచి తవ్వకాలు నిర్వహించాలని సూచనలు చేసిన నేపథ్యంలో ర్యాంపులను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని రెండు ఇసుక ర్యాంపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఇసుక తవ్వకాలకు ప్రస్తుత పరిస్థితి, గోదావరి వరద నీరు తగ్గిందా లేదా అనే అంశాలను పరిశీలించారు. గోదావరిలో వరద నీరు పూర్తిగా తగ్గిన వెంటనే తవ్వకాలు చేపట్టాలన్నారు. ఆయన వెంట కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, గనులు, భూగర్భ శాఖ రియాల్టీ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత, ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

శనేశ్వర ఆలయంలో పూజలు

కొత్తపేట, అక్టోబరు 5: మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువ జాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,17,990 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు ఎన్.సూర్యచక్రధరరావు తెలిపారు.

అన్నపూర్ణగా మాణిక్యాంబ అమ్మవారు



ద్రాక్షారామ, అక్టోబరు 5 :ద్రాక్షారామలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ద్వాదశ శక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారు మూడో రోజు శనివారం అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, పారాయణాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, సువర్ణ, రజత పుష్పార్చనలు జరిగాయి.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట

వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు



ఆత్రేయపురం, అక్టోబరు 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించి మూలవిరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.32.57 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్, ఈవో భూపతిరాజు నల్లం చక్రధరరావు తెలిపారు.



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

టార్గెట్ మార్చి 2026

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్ద ఎన్‌కౌంటర్
- ఏకంగా 31 మంది మావోయిస్టులు మృతి
- సల్వాజుడుంతో ప్రారంభమైన మావోయిస్టుల నష్టాలు


ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోల మృతదేహాల్ని మోసుకొస్తున్న జవాన్లు

చింతూరు, అక్టోబరు 5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించుకున్న టార్గెట్ మార్చి 2026 దిశగా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత ముమ్మరమైంది. మధ్యప్రదేశ్ నుంచి విడిపోయి ఛత్తీస్‌గఢ్ ఏర్పడ్డ 24 ఏళ్లకాలంలో ఇదే అతి పెద్ద ఎన్‌కౌంటర్. అంతేకాదు మావోయిస్టులకు అతి పెద్ద నష్టం కూడా. ఏకంగా 31 మంది మావోయిస్టులు జవాన్ల చేతిలో ఏకకాలంలో మృతి చెందడమనేది పెద్ద విజయంగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భావిస్తోంది. అదే దశలో ఇది డబుల్ ఇంజన్ విజయమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి పేర్కొనడం గమనార్హం. దివంగత కాంగ్రెస్ నాయకుడు మహేంద్రఖర్మ నేతృత్వంలో 2006లో సల్వాజుడుం ఏర్పడడం, ఆదివాసీ యువతకే నేరుగా తుపాకులిచ్చి మావోయిస్టుల వేటకు సంసిద్ధం చేయడంతో మొదలైన మావోయిస్టుల నష్టాలు నాటి నుంచి రోజురోజుకు పెరుగుతూ పోతున్నాయి. ఈ ఏడాది మేనెలలో కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే. ఇదే అతి పెద్ద ఎన్‌కౌంటర్‌గా గుర్తించిన క్రమంలో ఇప్పుడు 31 మంది మావోయిస్టులు కాల్పుల్లో మృతి చెందడంతో ఆ సంఖ్య దాటిపోయింది.

ప్రతి ఐదు కిలోమీటర్లకో పోలీసు క్యాంప్

మావోయిస్టుల అణచివేతే లక్ష్యంగా కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. ఇందులోభాగంగా ఛత్తీస్‌గడ్‌లో మావోయిస్టు ప్రభావిత జిల్లాలపై ప్రభుత్వం కన్నేసింది. జవాన్ల సహకారంతో ప్రతి మారుమూలకు రహదార్ల విస్తరణ పనులు మొదలుపెట్టారు. అదే దశలో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక పోలీసు క్యాంపు ఏర్పాటు జరుగుతోంది. ఒక్కో క్యాంపులో 500 నుంచి 1000 మంది వరకు జవాన్ల పహారా నిత్యం సాగుతోంది. మొన్నటి వరకు అబూజ్‌మాడ్‌లో అడుగుపెట్టేందుకు సంకోచించిన జవాన్లు ఇప్పుడు అక్కడ జల్లెడ పడుతూ మావోయిస్టులపై చేస్తున్న యుద్ధంలో పైచేయి సాధిస్తున్నారు. తాజా ఎన్‌కౌంటర్ కూడా అబూజ్‌మాడ్ పరిధిలోనే జరగడం గమనార్హం.

బెటాలియన్లలో స్థానిక ఆదివాసీ యువతీయువకులు

2005 నుంచి ఛత్తీసగఢ్‌లో మావోయిస్టుల ఏరివేత ముమ్మరమైంది. గతంలో సీఆర్‌పీఎఫ్, నాగాలాండ్ తదితర బలగాలను వందల సంఖ్యలో ఛత్తీస్‌గఢ్‌కు రప్పించి మావోయిస్టుల వేట మొదలుపెట్టారు. అయినా దాదాపు పదేళ్ల కాలం మావోయిస్టులదే పైచేయిగా సాగింది. బలగాలకు స్థానికంగా పట్టు లేకపోవడం, ఆదివాసీ భాష రాకపోవడంతో పెద్దమైనస్‌గా మారిందన్న అభిప్రాయాలుండేవి. దీంతో జవాన్లు నిత్యం మావోయిస్టుల చేతిలో ప్రాణాలు కోల్పోయేవారు. ఇది గుర్తించిన పోలీసుశాఖ స్థానిక ఆదివాసీ యువతీయువకులతోపాటు మరో అడుగు ముందుకేసి మావోయిస్టు పార్టీలో పనిచేసి లొంగిపోయిన ఆదివాసీ యువతకు కూడా బెటాలియన్లలో ఉద్యోగాలిచ్చి మావోయిస్టులపై యుద్ధం మొదలుపెట్టారు. ఈ మేరకు గ్రేహౌండ్స్ బలగాలతో వారందరికీ శిక్షణ ఇవ్వడం జరిగింది. అప్పటి నుంచి మావోయిస్టులపై పైచేయి మొదలైంది. మరోవైపు మావోయిస్టులను ఇప్పుడు పోలీసు ఇన్‌ఫార్మర్ వ్యవస్థతోపాటు కోవర్టుల బెడద పట్టిపీడిస్తోందన్న అభిప్రాయాలున్నాయి. ఇటీవలి వరుసగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడమే దీనికి ఉదాహరణ. ఈ క్రమంలోనే మావోయిస్టులు ఇన్‌ఫార్మర్లను, కోవర్టులను గుర్తించి ప్రజాకోర్టులో ఉరివేసి భయాన్ని సృష్టిస్తున్నారు.

31కి చేరిన మావోయిస్టు మృతుల సంఖ్య

చింతూరు, అక్టోబరు 5: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య 31కి చేరింది. శుక్రవారం నారాయణపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దున మావోయిస్టులు పెద్దఎత్తున గుమిగూడారన్న సమాచారం పోలీసులకు చేరింది. దీంతో 1000 మంది వరకు జవాన్లు ముందుగా ద్విచక్ర వాహనం, ఆపై కాలినడకన నెందూరు, తుల్తులి నడుమ ఉన్న మావోయిస్టుల డెన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ భీకర పోరులో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. శుక్రవారం 28 మంది మావోయిస్టు మృతదేహాలను స్వాధీనం చేసుకున్న జవాన్లు శనివారం మరో మూడు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను మోసుకొంటూ 25 కిలోమీటర్ల మేర కాలినడకన జవాన్లు బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఈ క్రమంలో వారంతా బ్రెడ్ మ్యాగిలతో కడుపునింపుకున్నారు. మొత్తం మీద తూర్పు బస్తర్ డివిజను మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. కాగా తాజా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టులను పోలీసులు గుర్తించే పనిలో పడ్డారు. వీరిలో ఇప్పటివరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కమలేష్, నీతిని గుర్తించారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో జవాన్లు మావోయిస్టు మృతదేహాలతోపాటు పలు ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఎకె రైఫిల్, ఎస్ఎల్ఆర్, ఎల్ఎంజి, 303 తుపాకీతోపాటు నగదు, కొన్ని ఆయుధాలున్నాయి. మావోల కాల్పుల్లో డీఆర్‌జీకి చెందిన ఒక జవాను గాయపడ్డాడు.

గండిపోశమ్మ దర్శనం నిలిపివేత

» ఆలయం వద్ద వరద తగ్గకపోవడమే కారణం

దేవీపట్నం, అక్టోబరు 5: దేవీపట్నం మండలంలోని గొందూరు గ్రామంలో మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి దర్శనం తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు దేవదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద ఇంకా వరద తగ్గని కారణంగా దర్శనాలు ప్రారంభించలేదని, భక్తులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు

కొవ్వూరు, అక్టోబరు 5: కొవ్వూరు లిటరరీ క్లబ్‌పై పోలీసులు దాడి చేయడంపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదుచేసినట్టు క్లబ్ గౌరవాధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. లిటరరీ క్లబ్‌లో పాలకవర్గ సభ్యులు రమ్మీ ఆడుకోవడానికి హైకోర్టు నుంచి అనుమతులున్నాయని, దీన్ని ధిక్కరించి క్లబ్‌పై దాడిచేసి ఇద్దరు గాయపడడానికి కారణమైన పోలీసులపై కర్నూలు మానవహక్కుల సంఘానికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

నేరాల అదుపులో అలసత్వం వద్దు

» మాదకద్రవ్యాలను అరికట్టాల్సిందే
» జూదంపై ఉక్కుపాదం మోపండి
» ఐజీ అశోక్‌కుమార్ ఆదేశం


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

రాజమహేంద్రవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నేరాల అదుపులో ఎట్టిపరిస్థితుల్లోను చిన్నపాటి అలసత్వానికి కూడా తావు ఇవ్వొద్దని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జూదంపై ఉక్కుపాదం మోపాలని, మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాల్సిందేనని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్, సౌత్‌జోన్ డీఎస్పీ కార్యాలయాల్లో శనివారం ఆయన వార్షిక తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తు, విచారణ, నేరాల తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతల నియంత్రణపై ఎస్పీ నరసింహ కిషోర్ తనతో చర్చించారన్నారు. దసరా, దీపావళి వేడుకల సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. గొడవలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రజలకు సహకరించాలన్నారు. అక్రమ మద్యం, గంజాయి, సారా, పేకాట వంటివాటి నిర్మూలనకు కృషిచేయాలన్నారు. కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచాలని చెప్పారు. ఇళ్లల్లో దొంగతనాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నేరాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. సిబ్బందితో ముఖాముఖి నిర్వహించి ఇబ్బందులపై ఆరా తీశారు. సర్వీసులో రిమార్కుల లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ఫ్రెండ్లీ, విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు(శాంతి భద్రతలు), డీఎస్పీలు రమేశ్ బాబు, భవ్య కిషోర్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు (ఎస్‌బీ), అప్పారావు(త్రీటౌన్), దుర్గారావు(టూటౌన్), గణేశ్ (ధవళేశ్వరం), వెంకటేశ్వరరావు(కడియం) పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా రత్నగిరి దుర్గలు


అన్నపూర్ణా దేవిగా భక్తులను అనుగ్రహిస్తున్న వనదుర్గ

అన్నవరం, అక్టోబరు 5: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రత్నగిరి దుర్గలు అయిన వనదుర్గ, కనకదుర్గలు శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు. సకల జీవకోటికి క్షుద్బాధను తీర్చి అన్నార్తులకు ఆహారమందించే దేవతగా అలంకరించారు.

అన్నపూర్ణాదేవిగా తలుపులమ్మ


అన్నపూర్ణా దేవిగా భక్తులను అనుగ్రహిస్తున్న తలుపులమ్మ

తుని రూరల్, అక్టోబరు 5: తుని లోవ దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా తలుపులమ్మ అమ్మవారిని శనివారం అన్నపూర్ణదేవిగా అలంకరించారు. అమ్మవారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు.

ఐషర్‌వ్యాన్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

- ఇద్దరి దుర్మరణం.. చెందుర్తి జంక్షన్ సమీపంలో ఘటన
- యువకుడిది పాతపెరుమాళ్లపురం, యువతిది పాలకొండ



ప్రమాద దృశ్యం.. మృతులు శివ, పద్మావతి (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 5: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి జంక్షన్ సమీపంలోని 216వ జాతీయ రహదారిపై శనివారం ద్విచక్రవాహనాన్ని ఐషర్‌వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువతీయువకులు దుర్మరణం చెందారు. మృతులు కాకినాడ, మన్యం జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి రోడ్డు నుంచి 216వ జాతీయ రహదారిపై చెందుర్తి జంక్షన్ వద్ద నుంచి కాకినాడ సర్వీసింగ్‌కు వెళ్తున్న ఐషర్ వ్యాన్‌ను గొల్లప్రోలునుంచి కత్తిపూడి వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న యువతీ, యువకులు ఢీకొట్టారు. ప్రమాదంలో యువతి అక్కడికక్కడే మరణించగా తీవ్రంగా గాయపడిన యువకుడిని పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మరణించిన యువకుడు తొండంగి మండలం కొత్తపెరుమాళ్లపురం గ్రామానికి చెందిన కుక్కా శివశ్రీను(20), యువతి మన్యం జిల్లా పాలకొండకు చెందిన గంబలి పద్మావతి (18)గా గుర్తించారు. వీరిద్దరూ ఎలా కలిశారన్న విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కుక్కా శ్రీను ఇంటర్ చదివి ప్రైవేటుగా డిగ్రీ చదువుతున్నాడు. అతడి తండ్రి మణిబ్బాయి వ్యవసాయం చేస్తుండగా ఇద్దరు సోదరీమణులకు వివాహమైంది. పద్మావతి కోరంగి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో బీఫార్మసీ రెండో ఏడాది చదువుతోంది. ఆమె 8 నెలల క్రితమే ఇక్కడ కళాశాలలో చేరింది. ఆమె తండ్రి శ్రీనివాసరావు, సోదరుడు సంజన్‌లు వ్యాన్‌డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. కళాశాలకు దసరా సెలవులిచ్చారని శనివారం బయలుదేరి వస్తానని చెప్పి పద్మావతి శుక్రవారం రాత్రి తండ్రి శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి చెప్పింది. ఉదయమే బయలుదేరతానని తెలిపింది. ఉదయమే ఇలా ప్రమాదం జరిగినట్టు పోలీసుల నుంచి సమాచారం రావడంతో తండ్రి ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇక రాజమహేంద్రవరం వెళ్లి కొత్త మోటార్ సైకిల్ కొనుక్కుంటానని చెప్పి శివశ్రీను ఇంటి నుంచి బయలుదేరాడు. తన స్నేహితుడి మోటార్‌సైకిల్ తీసుకువెళ్లిన కొంత సమయం తర్వాత ప్రమాదం జరిగినట్టు సమాచారం రావడంతో అతడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శివశ్రీను రాజమహేంద్రవరం వెళ్తానని చెప్పి కాకినాడ నుంచి ఎలా వస్తున్నాడో తెలియక వారు సతమతమవుతున్నారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరుమాళ్లపురంలో విషాదఛాయలు

తొండంగి, అక్టోబరు 5: ప్రమాద ఘటనతో మృతుడు కుక్కా శివ(20) స్వగ్రామం పెరుమాళ్లపురంలో విషాదఛాయలు నెలకొన్నాయి. స్థానికంగా ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న అతడు రాజమహేంద్రవరం వెళ్తానని బయలుదేరి అర్ధంతరంగా మరణించడాన్ని తల్లిదండ్రులు మణబ్బాయి, తల్లి సత్యవతి జీర్ణించుకోలేకపోతున్నారు.

ఏపీలో ఎన్‌సీసీ అకాడమీ స్థాపనకు కృషి : ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి



రాజానగరం, అక్టోబరు 5: ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక ఎన్‌సీసీ అకాడమీ స్థాపనకు కృషిచేస్తున్నామని ఎన్‌సీసీ (ఏపీ, తెలంగాణ) ఎస్ఎస్‌బీసీ, కాకినాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి తెలిపారు. గైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల సంప్రదింపులతో ఆయా ప్రాంతాల్లో అనువైన ప్రాంతాల్లో ఎన్‌సీసీ అకాడమీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గుంటూరులో ఏపీకి ప్రత్యేక ఎన్‌సీసీ డైరెక్టరేట్ కోసం ప్రణాళిక రూపొందించామన్నారు. ఇప్పటికే వైజాగ్, తిరుపతి ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశామన్నారు. 29 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశంలోని మొత్తం 17 ఎన్‌సీసీ డీటీల నుంచి ప్రత్యేకంగా ఎంపిక చేసిన 300 మంది సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరవుతున్న ఈ శిబిరాన్ని 12 రోజులు పాటు నిర్వహిస్తామన్నారు. జాతీయ సమైక్యత, సాంస్కృతిక వారసత్వం, క్యాడెట్లలో ఆయా రాష్ట్రాల సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడం, క్యాడెట్లు కమ్యూనిటీ లివింగ్, దేశ నిర్మాణం, ఏకత్వ భావన దిశగా స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలను చేపట్టనున్నట్టు చెప్పారు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి ప్రత్యేక డైరెక్టరేట్‌లు ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు.

కార్తీకమాసంలో రత్నగిరిపై భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఈవో సమీక్ష

● నవంబరు 13 తెప్పోత్సవం
● 15న గిరిప్రదక్షిణ, జ్వాలాతోరణం, పంపా హారతులు


కార్తీకమాసం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, అక్టోబరు 5: కార్తీకమాసం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి అసంఖ్యాకంగా సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, పర్వదినాలకు సంబంధించి ఏర్పాట్లపై శనివారం ఈవో రామచంద్రమోహన్ ఆలయ వైదిక కమిటీ, ఏఈవోలు, సూపరింటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గతేడాది లోటుపాట్లను అధిగమించి త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్తీకమాసం నవంబరు 1న ప్రారంభమై డిసెంబరు 1తో ముగియనుంది. వీటిలో పర్వదినాలుగా నాలుగు శని, ఆది, సోమవారాలు, శుక్ల, బహుళ దశమి, ఏకాదశి తిధులు, కార్తీకపౌర్ణమి పర్వదినాలుగా గుర్తించారు. ఈ పర్వదినాల్లో రోజుకు 50 వేలనుంచి సుమారు 80వేల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తూ ఏర్పాట్లపై దానికనుగుణంగా ఇంజనీరింగ్ సిబ్బంది అంచనాలు రూపొందించి పనులు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. రూ.300 వ్రతభక్తుల కోసం నూతనంగా ఏర్పాటుచేసిన క్యూలైన్‌లు అందుబాటులోకి తీసుకురావాలని, పశ్చిమరాజగోపురం ఖాళీప్రాంగణంలో తాత్కాలిక షెడ్లు ఏర్పాటుచేసి వ్రతం టిక్కట్లు, ప్రసాదం విక్రయకేంద్రం ఏర్పాటుచేయాలన్నారు. వైదిక కార్యక్రమాలను రద్దీతో సంబంధం లేకుండా ప్రధానాలయంలో మూలవరులచెంతనే నాలుగు సోమవారాలు ఏకాదశి రుద్రాభిషేకాలు, సాయంత్రం లక్షపత్రి పూజలను చేయాలని వైదిక కమిటీకి సూచించారు. నవంబరు 13న సత్యదేవుడి తెప్పోత్సవం జరగనుండడంతో పనులు వేగవంతం చేయాలని, 15న ఉదయం గిరిప్రదక్షణ సాయంత్రం జ్వాలాతోరణం, రాత్రికి పంపా హారతులకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. స్వామివారి వైదిక కార్యక్రమాల నిర్వహణలో లోటుపాట్లు తలెత్తితే సంహించేది లేదని హెచ్చరించారు. సత్యదీక్షలు నిర్వహణకు సంబంధించి 27 రోజుల దీక్ష స్వీకరించేవారు అక్టోబరు 27న , 18 రోజుల దీక్ష తీసుకునేవారు నవంబరు 6న, తొమ్మిది రోజుల దీక్ష స్వీకరించే దీక్షాపరులు నవంబరు 14న దీక్షలు స్వీకరించాలని, వీరంతా నవంబరు 23న సత్యదీక్షలు విరమణ చేయాల్సిఉంటుందని వైదిక కమిటీ ఈవోకు వివరించారు. ఈ ఏడాది సత్యదీక్షలు అధికంగా స్వీకరించేవిధంగా ప్రచారం కల్పించాలని పీఆర్వో అధికారులకు సూచించారు. త్వరలో రెవెన్యూ, పోలీస్ ఇతరశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, ఈలోగా ఏర్పాట్లపై విభాగాలవారీగా ఒక నివేదికను సిద్ధంచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సహాయకమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, ఈఈ రామకృష్ణ, డిఈలు రాంబాబు, ఏఈవోలు కొండలరావు, జగ్గారావు, ఎల్ శ్రీనివాస్, బ్రమరాంబ, సూపరింటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.


ఏపీఆర్వో గణపతికి విరాళం అందజేస్తున్న దాత

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, అక్టోబరు 5: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శనివారం తణుకు పట్టణానికి చెందిన తవ్వా సత్యానారాయణ రూ.1,11,116 విరాళంగా సమర్పించారు. దీన్ని దాత ఏపీఆర్వో ఎం.గణపతికి అందజేయగా, ఆయన స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

కఠినతర నాణ్యత పరీక్షలు

అన్నవరం, అక్టోబరు5: తిరుమల తిరుపతి దేవస్థానంలో నెయ్యి నాణ్యతపై పలు ఆరోపణలు రావడంతో అన్నవరం దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. ఈమేరకు శనివారం ఆహారనియంత్రణ అధికారులతో ఈవో రామచంద్రమోహన్ సమావేశమయ్యారు. దేవస్థానానికి సరఫరా అయ్యే ప్రోవిజన్స్ అన్నీ స్టోర్స్‌కు చేరిన తరువాత ఫుడ్ కంట్రోలర్‌కు సమాచారమిస్తే వాటన్నింటి నుంచి శాంపిల్స్ సేకరిస్తామని, అయితే ప్రభుత్వ ల్యాబ్‌లలో ఐదారు పరీక్షలు మాత్రమే తెలుస్తుందని, ఏ వస్తువుకు ఏఏ మోతాదులో కలిపి ఉన్నాయో తెలుసుకునేందుకు పారామీటర్స్ పరీక్ష ద్వారా నాణ్యత పరిశీలన లోతుగా జరుగుతుందని ఆహార సహాయ నియంత్రణాధికారి శ్రీనివాస్ వివరించారు. దీనికయ్యే ఖర్చును దేవస్థానం భరించాలని, ఒక్కో శాంపిల్‌కు ఖర్చు 8 వేల నుంచి 9 వేలవుతుందని చెప్పడంతో ఖర్చును దేవస్థానం చెల్లించేందుకు ఈవో అంగీకరించారు.

శ్రీపీఠంలో ఘనంగా శతకోటి కుంకుమార్చన

సర్పవరం జంక్షన్, అక్టోబరు 5: దేవీ శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా కాకినాడ శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగం-2024 శనివారం మూడోరోజుకు చేరింది. ఐశ్వర్యాంబిక అమ్మవారిని శ్రీరాజమాతంగిదేవి దివ్యఅలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవీ సూక్త, రాజమాతంగీ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాజమాతంగిదేవిని పూజించి శతకోటి కుంకుమార్చన, లలిత పారాయణం గావించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి స్వామీ పూరిపూర్ణానంద సరస్వతి అనుగ్రహ పారాయణం చేశారు. గదిలో దైవాన్ని నిలిపితే భక్తి అని, మదిలో నిలుపగలిగితే అదే ధ్యానం అవుతుందని అన్నారు. అఖిలాండ కోటి బ్రహ్మనాయకి అయిన జగన్మాత కేవలం ఒక గదికి పరిమితం కాదన్నారు. అమ్మవారి అనుగ్రహం కోసం, నరదృష్టి పరిహారంకోసం భక్తులు తీసుకొచ్చిన లక్ష నిమ్మకాయలను దేవీ సూక్త రాజమాతంగి దేవివద్ద ఉంచి లక్ష నిమ్మకాయలపూజ ఘనంగా నిర్వహించారు. శతకోటి కుంకుమార్చనలకు 30 వేలమంది భక్తులు పాల్గొన్నారు. ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి అమ్మవారి దివ్యసందేశం ఇచ్చారు. దుర్గారావు బృందం ఆధ్వర్యంలో సౌందర్యలహరి పారాయణం చేశారు. కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్, సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రమణీయం శ్రీరామ ధనస్సు, బాణం

అయోధ్య రామాలయానికి వెళ్తున్న ధనస్సు, బాణం మహాశక్తి యాగంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శతకోటి కుంకుమార్చన, లలిత పారాయణ సమయంలో వెండితో తయారు చేసిన ధనస్సు, బంగారంతో తయారు చేసిన బాణంతో కూడిన శ్రీరాముని ఆయుధాన్ని స్వామీజీ ప్రదర్శించారు.


కుంకుమార్చనకు హాజరైన భక్తులు


శ్రీరాజ మాతంగిదేవి దివ్య అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు

వెంకన్న ఆలయంలో విశేష పూజలు

యానాం, అక్టోబరు 5: యానాం శ్రీభూసమేత వెంకటేశ్వర స్వామి బాల ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం శ్రీవారి బ్రహ్మోత్సవ హంస వాహన కాపు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి సువర్ణపుష్పార్చన, ముత్యాల హారతి, సహస్ర నామార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు.

రేపు డివిజన్ కేంద్రంలోనే గ్రీవెన్స్‌సెల్

కొత్తపేట,అక్టోబరు5: ప్రతిసోమవారం జరిగేప్రజాసమస్యల పరిష్కారవేదిక(గ్రీవెన్స్ సెల్) కార్యక్రమం, వీడియోకాన్ఫరెన్స్ కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు.డివిజన్‌స్థాయిఅధికారులు, అర్జీదారులు గ్రీవెన్స్‌కు హాజరుకావాలన్నారు.

కార్యకర్తల సమష్టి కృషి ఫలితమే భారీ మెజార్టీ

రావులపాలెం, అక్టోబరు 5: కార్యకర్తల సమష్టి కృషి ఫలితంగానే మండలంలో మునుపెన్నడూలేని విధంగా భారీ మెజార్టీ సాధించ గలిగామని కూటమి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం కాపు కల్యాణ మండపంలో శనివారం మండలశాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు అధ్యక్షతన మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో నాయకులు అహంకార



ఆలమూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ధోరణికి పోకుండా కార్యకర్తలందరిని కలుపుకుని వెళ్లాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి కీలకం

ఆలమూరు, అక్టోబరు 5: కార్యకర్తలే పార్టీకి పునాదని, పార్టీకి కీలకంగా ఉండే కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. ఆలమూరు మండల టీడీపీ కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి అధ్యక్షతన శనివారం జరిగింది. ఎమ్మెల్యే బండారు ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేసుకుంటూ ముందుకు సాగుతుందని, దశల వారీగా కార్యకర్తలకు గుర్తింపు ఇస్తామన్నారు. నాయకులు ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్, దండంగి మమత, అనుసూరి నాగరత్నం, కె.సునీల్, వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, తాడి శ్రీనివాసరెడ్డి, వడ్డి వెంకన్న, వాకా సుబ్బలక్ష్మీదేవి, రామానుజుల శేషగిరిరావు, చంద్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎస్సార్ నిధుల వినియోగానికి అనుమతించాలి

అమలాపురంటౌన్, అక్టోబరు5: అంబాజీపేట మండలం కె.పెదపూడి గ్రామ అభివృద్ధికి మంజూరైన ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు శనివారం వినతిపత్రంఅందజేశారు.

'ఇంటర్ సర్టిఫికెట్లు పోగొట్టుకుంటే ఇలా చేయండి'

అమలాపురంటౌన్, అక్టోబరు 5: గడిచిన ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో అధిక వర్షాలు కురవడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు, వరదల కారణంగా పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఎందరో విద్యార్థులు ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు పోగొట్టుకున్నట్లు ఇంటర్మీడియట్ విద్యామండలి దృష్టికి వచ్చిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఎవరైనా విద్యార్థులు సర్టిఫికెట్లు పోగొట్టుకున్నట్లయితే వారి ఆధార్‌కార్డు నకలు, పోగొట్టుకున్న సర్టిఫికెట్ నంబరు మొదలైన వివరాలతో దరఖాస్తును జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికిగాని, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారికి గాని అందజేయాలన్నారు. ఇందు కోసం ఏవిధమైన రుసుము చెల్లించనవసరం లేదని చెప్పారు. ఆయా విద్యార్థులకు డూప్లికేట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి తెలిపిందన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే ఆనందరావు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆనందరావు

ఉప్పలగుప్తం, అక్టోబరు 5: ప్రజాసమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ప్రతి నెలా మండలంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించారు. మళ్లీ గ్రీవెన్స్ నాటికి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 59ఫిర్యాదులు అందినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, ఎంపీపీ దంగేటి వీరఅమ్మతజానకీరాంబాబు, ఎంపీడీవో ఎంఎల్ఎన్ మూర్తి, తహసీల్దార్ వీఎస్ దివాకర్, కూటమి నాయకులు రవణం మధు, ఆకుల సూర్యనారాయణమూర్తి, మంచెం బాలకృష్ణ, సలాది నాగరాజు, చిక్కం భీముడు, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, గొలకోటి చిన్నా, ఆకేటి పెద్ద, సలాది శ్రీనివాసరావు, కంకటాల రాము, సర్పంచ్‌లు చిక్కం జంగమయ్య, నల్లా బాబండి, జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జన్మనక్షత్ర పూజలు

అంతర్వేది, అక్టోబరు 5: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా ఘనంగా స్వాతి నక్షత్ర పూజలు నిర్వహించారు. తొలుత అర్చకులు బంగారుకలశను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ అనంతరం అష్టోత్తర శతకలశాభిషేకం చేశారు. పంచామృతాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108కలశాలతో విశేష అర్చనా కార్యక్రమాలను ప్రధాన అర్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ సారథ్యంలో జరిపించారు.

డ్రైన్ పనుల అడ్డగింత

మామిడికుదురు, అక్టోబరు 5: మొగలికుదురులో పంచాయతీ అనుమతి లేకుండా నిర్మిస్తున్న డ్రైన్ నిర్మాణ పనులను శనివారం పంచాయతీ పాలకవర్గ సభ్యులు అడ్డుకుని పనులు నిలుపుదల చేయించారు. రాజోలు మండలం తాటిపాక నుంచి మొగలికుదురు వరకు అక్రమంగా డ్రైన్ నిర్మిస్తున్నారని, దీనికి ఏవిధమైన అనుమతి లేదని సర్పంచ్ కడి అరుణకుమారి, పాలకవర్గ సభ్యులు తెలిపారు.తాటిపాక నుంచి గ్రామంలోకి డ్రైన్‌నిర్మించేందుకు వీలులేదని వారు తేల్చి చెప్పారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా పెద్దకాపు

మలికిపురం, అక్టోబరు 5: మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్‌గా రాజోలు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గుండుబోగుల నరసింహారావు(పెద్దకాపు) విజయవాడ మార్క్‌ఫెడ్ కార్యాలయంలో శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత మలికిపురం నుంచి అనుయాయులతో ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన రాజోలు నియోజకవర్గ నాయకులు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, గుబ్బల ఫణికుమార్, మల్లిపూడి సత్తిబాబు, తాడి మోహన్, రాపాక రమేష్‌బాబు పాల్గొన్నారు.


రూ.24.74 కోట్లు విడుదల

ముమ్మిడివరం, అక్టోబరు5: పీఎం కిసాన్ యోజన పథకం కింద ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలో 1,23,699 మంది రైతుల ఖాతాలకు శనివారం రూ.24.74కోట్లు జమ అయినట్టుజిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు తెలిపారు.

మోటార్‌సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 5: జాతీయ రహదారిపై అమలాపురం కళాశాల రోడ్డులోని శ్రీకృష్ణేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. మోటారుసైకిల్‌పై వెళుతున్న వ్యక్తి కారును తప్పించబోయి గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ వెనుక చక్రాల కింద పడిపోయాడు. అతని కాళ్లపై నుంచి లారీ వెళ్లిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ స్పందించి అంబులెన్సులో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ తరలించారు.

సీఐ శేఖర్‌బాబుకు ఏబీసీడీ అవార్డు



రావులపాలెం, అక్టోబరు 5: రావులపాలెం టౌన్ సీఐ శేఖర్ బాబు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి ఏబీసీడీ అవార్డును అందుకున్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంకు దోపిడీ కేసును సీఐ ఎం.శేఖర్‌బాబు ప్రతిభ కనబరిచి ఛేదించి రెండున్నర కేజీల బంగారం, రూ.5 లక్షల నగదు రికవరీ చేశారు. దీంతో అప్పటి పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, ప్రత్తిపాడు ఎస్ఐ పవన్‌కుమార్‌తో పాటు అప్పటి ప్రత్తిపాడు సీఐగా పనిచేసి ప్రస్తుతం రావులపాలెం టౌన్ సీఐగా పనిచేస్తున్న శేఖర్‌బాబులకు డీజీపీ అవార్డులను అందజేశారు.

ఎస్.యానాం బీచ్‌కు ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

అమలాపురం టౌన్, అక్టోబరు 5: పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఎస్.యానాం బీచ్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. ప్రత్యేక నిధులతో ఎస్.యానాం బీచ్‌ను అన్ని సదుపాయాలతో ఆధునికీకరించామన్నారు. నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే ఆనందరావు శనివారం ప్రారంభించారు. ప్రతీ ఆదివారం ఉదయం 5నుంచి రాత్రి 8.30గంటలవరకు 12 సింగిల్ ట్రిప్పుల్లో బీచ్‌కు బస్సు సదుపాయం ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ సీహెచ్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. రూ.30 సాధారణ చార్జీలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఆర్టీసీ సిబ్బంది, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి వరహాలబాబు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాబ్జిరాజు బాధ్యతల స్వీకరణ



అమలాపురం రూరల్, అక్టోబరు 5: అమలాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఉండ్రు బాబ్జిరాజు శనివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేసిన జి.మల్లికార్జునరావు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. మల్లికార్జునరావును మలికిపురం ఈవోపీఆర్డీగా బదిలీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు నుంచి బాబ్జిరాజు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపురాజు, సంఘ ప్రతినిధులు కోడూరి వెంకటేశ్వరరావు, బొర్రా ఆదిశంకరం, కేవీఆర్కే రాజు, పరంశెట్టి ఆదినారాయణ, పరంశెట్టి శ్రీనివాస్, కార్యాలయ పరిపాలనాధికారి కుమారి, శాస్త్రి, శిరగం నాగేంద్ర, దారా రామకృష్ణ తదితరులు పాల్గొని ఎంపీడీవోను అభినందించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మిని ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఎంపీడీవోగా కీర్తి బాధ్యతల స్వీకరణ



రాయవరం, అక్టోబరు5: రాయవరం ఎంపీడీవోగా ఎస్.కీర్తి స్పందన కుమారి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కొవ్వూరి నరేంద్రరెడ్డి బదిలీపై వెళ్లారు. కీర్తిని పలు శాఖల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఎంపీడీవోగా వెంకటరామన్



ఆత్రేయపురం, అక్టోబరు 5: ఆత్రేయపురం ఎంపీడీవోగా బీకేఎస్ఎస్ వెంకటరామన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గండేపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన నాతి బుజ్జి అక్కడికి బదిలీపై వెళ్లారు.

పి.గన్నవరం ఎంపీడీవోగా కేవీ ప్రసాద్



పి.గన్నవరం, అక్టోబరు 5: పి.గన్నవరం ఎంపీడీవోగా కె.వి.ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎ.భారతి సీతానగరం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. ఎంపీడీవో ప్రసాద్‌కు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

కె.గంగవరం, అక్టోబరు 5: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం పాణింగపల్లి, సత్యవాడ, సుందరపల్లి, గంగవరం గ్రామాల్లో మన గ్రామం, మన సుభాష్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. అర్హులు వృద్ధాప్య పింఛన్ కోసం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. కూటమి నాయకులు మరివాడ చిన్ని కృష్ణ, చిర్రా రాజ్‌కుమార్, అవసరాల రమణమూర్తి, కొత్తపల్లి మురార్జీ, బలుసు నాగేంద్ర, కొత్తపల్లి వెంకట్రావు, తోట వెంకన్న, సలాది వెర్రిబాబు, సలాది రమేష్, బలుసు శివప్రసాద్, గన్ని శ్రీనివాసు, సలాది శ్రీను, అధికారులు పాల్గొన్నారు. పాణింగపల్లి సభలో క్యాన్సర్‌తో బాధపడుతున్న పాము నవ్యశ్రీకి రూ.20వేలు అందజేశారు.

వైద్య సేవల్లో దాతల కృషి ఎనలేనిది



కపిలేశ్వరపురం, అక్టోబరు 5: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించేందుకు ప్రత్యేక సదుపాయాలుకల్పించడంలో దాతల కృషి ఎనలేనిదని మాజీ మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం అంగర, పడమరఖండ్రిక పీహెచ్‌సీ ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బలుసు జానకిరామయ్య పర్యవేక్షణలో దివంగత బలుసు రుద్రయ్య కుమారుడు డా. బలుసు సుబ్బారావు భార్య దివంగత వసుంధర జ్ఞాపకార్థం రూ.75లక్షలతో నిర్మించిన పీహెచ్‌సీ ప్రత్యేక బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, విజయనగరం జోనల్ ఆర్టీసీ మాజీ ఛైర్మన్ నెక్కంటి బాలకృష్ణ, డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర ప్రసంగించారు. ప్రవాసాంధ్రుడు డాక్టర్ బలుసు సుబ్బారావు జన్మభూమికి మేలు చేయాలన్న ఆశయం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సేవా కార్యక్రమాలు చేపట్టిన డా. సుబ్బారావు తనయుడు డా. ప్రతాప్‌లను ఎమ్మెల్యే వేగుళ్ల అభినందించారు. ప్రముఖులను, దాతలను ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు సత్కరించారు. తొలుత ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ బలుసుసుబ్బారావు భార్య వసుంధర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, రెడ్డి ప్రసాద్, అంగర, పడమరఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు, బలుసు సుబ్బారావు కుటుంబ సభ్యులు బలుసు ప్రతాప్, చంద్రనిర్మల పాల్గొన్నారు.

యువకుల మధ్య వాగ్వివాదం

విద్యార్థికి గాయాలు

కొత్తపేట, అక్టోబరు 5: ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారితీసింది. వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. బీఏ రెండో సంవత్సరం చదువుతున్న చింతాడి సింహాద్రి, బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న గొన్నూరి చంద్రశేఖర్ మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో చంద్రశేఖర్ అతని సోదరుడైన శివసూర్యనారాయణకు ఫోన్ చేయించి రప్పించాడు. కళాశాల బయటకు వెళ్లిన తర్వాత సింహాద్రిపై చంద్రశేఖర్ సోదరుడు శివసూర్యనారాయణ తనతో తెచ్చుకున్న చాకుతో కుడి భుజంపై పొడవడంతో సింహాద్రి గాయపడ్డాడు. అతడిని స్నేహితులు కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్ఐ త్రిమూర్తులు తెలిపారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి

కె.గంగవరం, అక్టోబరు 5: కోట ఏటిగట్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కొవ్వూరు గ్రామానికి చెందిన కౌజు ఆనంద్, అతడి స్నేహితుడు ఆర్.సందీప్ యానాం వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి జొన్నాడ వైపు వెళ్తుండగా కోట వద్ద బైక్ అదుపుతప్పడంతో వారు కింద పడిపోయారు. కౌజు ఆనంద్(20) అక్కడికక్కడే మృతి చెందాడు. సందీప్‌కి స్వల్పగా యాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీబాష తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యం

అమలాపురం టౌన్, అక్టోబరు 5: సంపూర్ణ ఆరోగ్యం కోసం నిత్య వ్యాయామంతో పాటు పౌష్టికాహారం, సరైన నిద్ర అవసరమని ప్రపంచ బాడీ బిల్డింగ్ విజేత ఆరంభం బాబిసింగ్ చెప్పారు. ఇటీవల జరిగిన ఇండియర్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన స్వామిరమేష్‌కుమార్‌ను అభినందించేందుకు బాబిసింగ్ అమలాపురంలోని హెల్త్ అండ్ ఫిట్‌నెస్‌జిమ్‌కు విచ్చేశారు. కోనసీమ బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాబిసింగ్‌ను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు, రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులు వాసంశెట్టి నరేష్, గుబ్బల గణేష్‌బాబు, మట్టపర్తి వెంకటసముద్రం, జిమ్ కోచ్‌లు కంకిపాటి వెంకటేశ్వరరావు, గొలకోటి మహేష్, జి.రారాజు, ఎస్కే. వలియా సాహేబ్, కత్తుల శ్రీనివాసరావు, మారే వీరేంద్ర, సంసాని భవాని, బి.యశ్వంత్ పాల్గొన్నారు.

దళితుల సంక్షేమమే లక్ష్యం

ఆత్రేయపురం, అక్టోబరు 5: దళితుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ర్యాలి గ్రామ ఎస్సీ సొసైటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన ఎస్సీ సొసైటీ అధ్యక్షుడు కప్పల ఇజ్రాయిల్, సంఘ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకునివెళ్లారు. ఎస్సీ సొసైటీకి పూర్తిస్థాయి సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలంగి రవిచంద్ర, పొడుగుమాటి ప్రసాద్, ఉండ్రు బాలకృష్ణ, రావి లక్ష్మణ్, కఠారి శాంతరత్నం, కాలిదాసు పరంజ్యోతి పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీగా నాగేంద్ర

అల్లవరం, అక్టోబరు 5: అల్లవరం ఈవోపీఆర్డీగా యు.నాగేంద్ర బాధ్యతలు స్వీకరించారు. కె.గంగవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.